క్లుప్తంగా

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన సతీష్‌రెడ్డి



మంత్రికి పూలమొక్కను అందజేస్తున్న శేరి సతీష్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రుల సముదాయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించి పూలమొక్కను అందజేశారు. వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి. సంజీవరావు, డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, మేకల మైఖేల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫణీంద్ర కుమార్, రేష్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్



ఎమ్మెల్యే కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, గౌసుద్దీన్ దంపతులు గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకం



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి పుష్పాభిషేకం నిర్వహించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జహంగీర్ పీర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి

ఇరుకు గదుల్లోనే ఆరోగ్య కేంద్రం

డివిజన్‌లోని లైన్స్‌టౌన్ కాలనీ అద్దె ఇంట్లో ఇరుక్కు గదుల్లోనే ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం కొనసాగుతుంది. వచ్చే రోగులకు, మందుల నిల్వకు సరిపోవడం లేదు. దీంతో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నాటి మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. హస్మత్‌పేటలో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్‌లోకి మారిస్తే ఉపయోగంగా ఉంటుందని వివరించారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. తదనంతరం డీఎంహెచ్‌ఓ జీహెచ్‌ఎంసీ అధికారులకు లేఖ రాసినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ఇరుక్కు గదుల్లోనే కేంద్రం కొనసాగుతోంది. మోడల్ మార్కెట్‌లోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎప్పుడు తరలిస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. – ఓల్డ్‌బోయిన్‌పల్లి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇరుకు గదుల్లో రోగుల ఇబ్బందులు

- సరిపడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది
- మోడల్ మార్కెట్‌లోకి తరలించేందుకు గతంలోనే ప్రతిపాదనలు
- నేటికీ నిరుపయోగంగా మార్కెట్ భవనం
- డీఎంహెచ్‌ఓ లేఖ రాసిన స్పందించని జీహెచ్‌ఎంసీ అధికారులు

రెండేళ్లు గడుస్తున్నా స్పందించని జీహెచ్‌ఎంసీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మోడల్ మార్కెట్ భవనం అప్పగించాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరినా జీహెచ్‌ఎంసీ నుంచి స్పందన రాలేదు. డీఎంఅండ్‌హెచ్‌ఓ కూడా ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అయినా స్పందించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు సానుకూలంగా స్పందించినా అధికారులు ఎందుకింత నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. అద్దె భవనంలో 10 మంది రోగులు వస్తే కూర్చోవడానికి కూడా స్థలం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

మార్కెట్ భవనంలోకి మార్చితే..

మోడల్ మార్కెట్ భవనంలోకి ప్రాథమిక ఆరోగ్య



హస్మత్‌పేటలో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనం

కేంద్రాన్ని మార్చితే డయాగ్నొస్టిక్ సెంటర్, మెడికల్ రూం, రోగులకు హాల్, ల్యాబ్ ఇతరత్రా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలుస్తోంది. రోజుకు వందకు పైగా పేషెంట్లు, సోమవారం, శుక్రవారం ఏఎన్‌సీ చెకప్‌లకు తగిన స్థలం ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇంకెప్పుడు మార్కెట్ భవనంలోని మారుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ ప్రత్యేక దృష్టి సారించి మంత్రిని కలిసైనా సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నేటి నుంచి మహారుద్ర యాగం

- 13 వరకు వివిధ పూజలు, హోమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- ఎంసీహెచ్‌ఎస్, భరద్వాజ శ్రీవిద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహణ

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎంసీహెచ్‌ఎస్, భరద్వాజ శ్రీవిద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు శ్రీ లక్ష్మీనారాయణ మహా రుద్ర యాగం వైభవంగా నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భరద్వాజ శ్రీవిద్యాపీఠం వ్యవస్థాపకులు విష్ణుభట్ల లక్ష్మీనరసింహ శర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ, శ్రీ చండీ, శ్రీ మహారుద్ర యాగం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌గ్వరణములు, జప పారాయణం, గణపతి హోమం, శ్రీ చక్రవావరణ పూజ, అభిషేకం, హారతి, మంత్ర పుష్పములతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శనివారం నుంచి 13వ తేదీ వరకు శివ ముక్కోటి సందర్భంగా ఉదయం 4 గంటలకు మహాన్యాసపూర్వక పూజ, ఏకాదశ రుద్రపూర్వక అన్నాభిషేకం, ముగింపు సందర్భంగా అభిషేకం, హారతి, వేద పండితుల ఆశీర్వాదం, ఋత్విక్ సన్మానముతో ఈ పూజా కార్యక్రమాలు ముగుస్తాయి. ముగింపు సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. 11 రోజుల పాటు జరిగే ఈ హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమంలో మోతీనగర్ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



హోమం కోసం సిద్ధం చేసిన గుండాలు

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మూసాపేట: ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తామని గురువారం విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇంట్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, సెలవు దినాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులు క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి బిస్కెట్ల విరాళం



వెండి బిస్కెట్లు అందజేస్తున్న దాతలు రాధాకృష్ణ, లక్ష్మిలతో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు



వెండి బిస్కెట్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారి ప్రధాన ద్వారం తలుపుల కోసం దాతలు వెండి బిస్కెట్లు అందజేశారు. దాతలు యలమంచిలి రాధాకృష్ణ, లక్ష్మిలు గురువారం 30 కిలోల వెండి బిస్కెట్లను స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో ఆలయ పండితులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, పగుడాల బాబూరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాయినేని చిన్న తులసీరావు పాల్గొన్నారు.

5న భగవద్గీత అభ్యాస తరగతులు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకర మఠంలో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు భగవద్గీత అభ్యాస తరగతులు నిర్వహించనున్నట్లు మఠం మోతీనగర్ శాఖ పరిపాలనాధికారి సీఎస్ఆర్.మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భగవద్గీత అభ్యాస కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ మోసాలపై ఫిర్యాదు చేయొచ్చు

మూసాపేట: సైబర్ మోసాల ద్వారా రూ.1.50 లక్షలు పోగొట్టుకుంటే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కూకట్‌పల్లి పీఎస్ సీఐ ముత్తు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా బాలానగర్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు ఫిర్యాదును స్వీకరిస్తామన్నారు. గతంలో రూ.50 వేల వరకు పోగొట్టుకున్న బాధితుల నుంచి మాత్రమే ఫిర్యాదులు స్వీకరించేవారని, ఆపై ఎక్కువ డబ్బులు పోగొట్టుకున్న బాధితులను సైబర్ క్రైమ్‌కు కేసును బదిలీ చేసే వాళ్లమని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, నూతన టెక్నాలజీతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాలాలో చెత్తాచెదారాన్ని తొలగించాలి

మోతీనగర్: ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని బబ్బుగూడ, అవంతినగర్ తోట ఇళ్ల మధ్యలో ఉన్న ఓపెన్ నాలాలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం నాలా ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నాలాలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, బబ్బుగూడ సంక్షేమ సంఘం అధ్యక్షులు బోడ వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు మాజిద్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తన్నీరు తిరుపతిరావు, నాయకులు సుందర్, శ్రావణ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: శ్రీ హరిహర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తూండ్ల కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను గురువారం కూకట్‌పల్లిలోని సేవా సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని నిరుపేదలకు తమ వంతు సేవ చేయాలనే లక్ష్యంతో 25 సంవత్సరాల క్రితం సేవా సమితిని స్థాపించామన్నారు. ఎందరో నిరుపేదలకు తమ వంతు సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు మద్రు నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి దొంతినేని వెంగళరావు, ఆర్థిక కార్యదర్శి తూండ్ల వెంకటరమణ శర్మ, కార్యదర్శి దండె ప్రభు, తూండ్ల వశిష్ఠ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ కళాశాల ఘటనపై విచారణ జరపాలి

కేపీహెచ్‌బీకాలనీ: సీఎంఆర్ కళాశాల ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని గురువారం జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోరం, ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వసతి గృహంలోని గ్రౌండ్ ఫ్లోర్ సీసీ పుటేజీలను పరిశీలించి విచారణ జరపాలన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తరచుగా విశ్వ విద్యాలయ పరిధిలోని బాలికల వసతి గృహాలను పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో రాహుల్ నాయక్, గోపాల చందు, సాయికుమార్ రాథోడ్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, చైతన్య, సాత్విక్, ధనుంజయ్, సాగర్, హేమంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విలీనమా.. వ్యూహమా?

- శివారు మున్సిపాలిటీల విలీనంపై సందిగ్ధం
- శ్రీధర్ బాబు ప్రకటనతో నేతల్లో చిగురించిన ఆశలు
- 27తో ముగియనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయకుండానే ఎన్నికలు నిర్వహిస్తారనే ఊహాగానాలతో స్థానిక నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల శాసనసభ సమావేశాల్లో మంత్రి శ్రీధర్‌బాబు చేసిన ప్రకటనతో విలీనం లేనట్టేననే సంకేతాన్ని ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చినట్లు ఆయా పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు ద్వితీయ శ్రేణి నాయకుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఒక వేళ ఎన్నికలు జరిగితే ఈ సారి తప్పకుండా ప్రజాప్రతినిధిగా విజయం సాధించాలనే పట్టుదలతో ఆశావహులు పైరావీలు ప్రారంభించారు.

పునరాలోచనా..వ్యూహాత్మకమా!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శివారు ప్రాంతాలు, రింగ్ రోడ్డు లోపల ఉన్న 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలనే ఆలోచనలతో ఆదేశాలు జారీ చేసింది. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదనే కారణంగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. విలీనం దిశగా అధికారులు సైతం చర్యలు ప్రారంభించారు. అంతలోనే లోక్ సభ ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో మంత్రి శ్రీధర్ బాబు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేయడం లేదని ప్రకటించడంతో శివారు ప్రాంతాలను విలీనం చేసే ప్రక్రియపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందా? పునరాలోచనలో పడిందా! లేక పదవీ కాలం పూర్తయ్యే వరకు వ్యూహాత్మకంగా ఈ చర్చకు తెరలేపారా! అనే దానికిపై నాయకులు, ప్రతిపక్షాలు ఆలోచనలో పడ్డారు. జనవరి 27తో శివారులోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీ కాలం ముగియనుంది.



నేతల్లో చిగురించిన ఆశలు

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ప్రభుత్వం జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం లేదనే పుకార్లతో ఆయా డివిజన్లు, వార్డుల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్న నాయకుల్లో ఆశలు చిగురించాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 33 డివిజన్లు ఉన్నాయి. యధావిధిగా ఎన్నికలు జరిగితే 33 నుంచి 50 డివిజన్ల వరకు పెరిగే అవకాశం ఉంది. అన్ని పార్టీల నుంచి సుమారు 200 మంది వరకు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ఇక కొంపల్లి మున్సిపాలిటీలో ప్రస్తుతం 18 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీగానే ఉంటే మరో 4 వార్డులు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ సుమారు 100 మంది వరకు వివిధ పార్టీ నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. దుండిగల్ మున్సిపాలిటీలో మొత్తం వార్డులు 28 ఉన్నాయి. మున్సిపాలిటీగానే కొనసాగితే మరో 8 వార్డులు పెరిగే అవకాశం ఉంది. ఎన్నికలు జరిగితే సుమారు 150 మంది ఆశావహులు వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అవకాశం ఉంది.

రేషన్‌కార్డులో నమోదుకాని పేర్లు!

- ఐదేళ్లుగా మ్యుటేషన్లకు దిక్కే లేని పరిస్థితి
- పెండింగ్‌లో మ్యుటేషన్ల దరఖాస్తులు 86,885
- గత సర్కారు హయాంలో 90 వేల రేషన్ కార్డులు రద్దు
- కొత్త కార్డుల కోసం 1.89 లక్షల దరఖాస్తులు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఉప్పల్‌లో నివసిస్తున్న దేవేందర్ నాలుగేళ్ల కిందట తన పాప పేరు రేషన్ కార్డులో చేర్చాలని మీ–సేవలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం తన రెండో బాబు వివరాల నమోదు కోసం మీ–సేవ కేంద్రానికి వెళ్లారు. పాతది పెండింగ్‌లో ఉన్నందున ఈ వివరాలు నమోదు చేస్తే దరఖాస్తు తీసుకోవడం లేదు. ఈ పరిస్థితి ఒక మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే కాదు.. అంతటా నెలకొని ఉంది. ఐదేళ్లుగా మీ–సేవ కేంద్రంలో రెండో బిడ్డ వివరాలు చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది. కనీసం దరఖాస్తు చేసుకోవటానికి కూడా వీల్లేకుండా పోయింది.

86 వేల పెండింగ్ దరఖాస్తులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తమ పిల్లల పేర్లను ఆహార భద్రత కార్డులో నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాల్లో 86,885 మంది దరఖాస్తు చేసుకోగా, ఐదేళ్లుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇందులో బాలానగర్–1లో 35,735 దరఖాస్తులు ఉండగా, బాచుపల్లిలో 1260, గండిమైసమ్మ దుండిగల్‌లో 2,669, ఘట్కేసర్‌లో 2,731, కాప్రాలో 3,688, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,657, మేడిపల్లిలో 3,169, ఉప్పల్–2లో 29,264, శామీర్‌పేట మండలంలో 2,324 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు సైతం శూన్యంగానే ఉన్నాయి.



లక్షకు పైగా దాటేవి..

గత పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఆహారభద్రత కార్డులు జారీ చేసింది. తర్వాత రెండు సార్లు కొత్త కార్డులు జారీ చేసి చేతులు దులుపుకుంది. సభ్యుల వివరాలు కార్డుల్లో చేర్పించేందుకు అవకాశం కల్పించలేదు. కానీ, పేర్లను చేర్చేందుకు మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు ఇప్పటికీ కార్డుల్లోకి ఎక్కలేదు. వారికి రెండో సంతానం పుట్టగా.. నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాలకు వెళ్తే మొదటి దరఖాస్తే పెండింగ్‌లో ఉన్నందున రెండోది తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇలాంటి వారికి అవకాశమిస్తే దరఖాస్తులు లక్షకు పైగా చేరేవని జిల్లా పౌరసరఫరాల శాఖ పేర్కొంటున్నాయి.

గత సర్కారు హయాంలో 90 వేల కార్డులు రద్దు

మేడ్చల్ జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ (ఆహార భద్రత) కార్డులను మంజూరు కాకపోగా, 2016లో ఉన్న రేషన్ కార్డుల నుంచి 90,040 రేషన్ కార్డులను రద్దు చేసింది. రేషన్ కార్డుల రద్దుకు అప్పట్లో చూపిన కారణాల్లో ప్రధానంగా ఉపాధి కోసం ప్రజలు వలస వెళ్లటం.. కుటుంబంలో ఆడపిల్ల వివాహం తర్వాత ఆమె పేరు తొలగించకపోవటం.. మృతిచెందిన వారి పేర్లు కూడా తీసివేయకపోవటం వంటివి పేర్కొంది. ఈ కారణాల నేపథ్యంలోనే 2016లో అప్పటి సర్కారు ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ 90,040 రేషన్ కార్డులు రద్దు చేసింది. దీంతో నిరుపేద లబ్ధిదారులు ఏళ్ల తరబడి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై అప్పటి ప్రభుత్వం స్పందించకపోవటంతో కొందరు లబ్ధిదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, మరోసారి పరిశీలించాలని సూచనలిచ్చింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రేషన్‌కార్డుల పునరుద్ధరణకు సర్వే ప్రక్రియ చేపట్టినప్పటికీనీ పూర్తి చేయలేకపోయింది.

కార్డుల కోసం 1.89 లక్షల దరఖాస్తులు

రాష్ట్ర ఆవిర్భావం నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదు. 2025 సంక్రాంతి నుంచి కార్డులను జారీ చేయనున్నట్లు సర్కారు ఇటీవల ప్రకటించటంతో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారితోపాటు కొత్తగా అర్జీలు పెట్టుకునేవారూ ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం కాంగ్రెస్ సర్కారు దరఖాస్తులు స్వీకరించగా, 1.89 లక్షల అర్జీలు పౌరసరఫరాలశాఖకు చేరాయి. తాజాగా సంక్రాంతి నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించటంతో మరోసారి అర్జీలు స్వీకరించనుండటంతో సంఖ్య పెరిగే అవకాశముంది. మేడ్చల్ జిల్లాలో ప్రస్తుతం 5,32,938 రేషన్‌కార్డులు ఉండగా, 17,18,351 మంది లబ్ధిదారులు ఉన్నారు.

రద్దు అయిన కార్డులిక్కడే

మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 95,040 తెల్ల రేషన్ కార్డులు రద్దు కాగా, మండలాలు, జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల వారీగా రద్దయిన తెల్ల రేషన్‌కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. బాచుపల్లి మండలంలో 2,378 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, ఘట్కేసర్‌లో 2,273, కాప్రాలో 2,263, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,306, మేడిపల్లిలో 4,165, శామీర్‌పేట్‌లో 893, మూడుచింతలపల్లి మండలంలో 328 రేషన్ కార్డులు రద్దు అయ్యాయి. ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 39,270, బాలానగర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 35,210 తెల్ల రేషన్ కార్డులు రద్దయ్యాయి.